## నో పార్కింగ్ ప్లీజ్

"నువ్వు కలుగజేసుకోక తప్పదు" అన్నారు మా ప్రిన్సిపాల్ గారు.

మా కాలేజీ ప్రక్కనే మునిసిపల్ పార్కొకటుంది. అది నగరం నడిబొడ్డున వుండీకూడా చాలా అనారోగ్యకరంగా కనిపిస్తుంది. "పార్కు అనగానే సాయంకాలా లప్పుడు స్నేహితులు, ప్రేయసీ ప్రియులు, భార్యాభర్తలు— ఇలా రకరకాల అనుబంధాలవాళ్ళు ఒంటరిగా, జంటలుగా సరదాగా కాలం గడపడానికి ఉపయోగపడే చోటు అని అంచనా కాని, ఆయన చూశారట! అక్కడ పేకాట లాడడం, తాగడం, కొట్లాడు కోవడమున్నూ. పార్కు చుట్టూ వున్న అలగా జనపు గుడిసెలు చూసి ఆయన చాలా కలత చెందారు.

"ఈ వూరి మునిసిపల్ కమీషనర్ నీ క్లాస్‌మేట్ కదా, ఆయనతో చెప్పి ఏదో చేయించి ఈ న్యూసెన్సు భరించలేకుండా వున్నాను!" అన్నారాయన.

మాధవరావూ, నేనూ క్లాస్‌మేట్స్ కాని మా యిద్దరి మధ్య పెద్ద 'ఇంటిమసీ' లేదు. హైస్కూల్ దాకా పక్క పక్క సెక్షన్లలోనూ; కాలేజీలో వేర్వేరు గ్రూపుల్లోను; యూనివర్శిటీలో వేర్వేరు హాస్టల్

క్లాక్సులోనూ; ఉద్యోగాల్లో వేర్వేరు డిపార్ట్‌మెంట్లలోను- ఇలా సమానాంతరంగా వున్నాం. ఒకరికొకరు బాగా తెలుసు కాని పలకరించుకోం. ఇలాంటి డైమెన్షనల్ స్నేహంలో, ఏ ఇద్దరు కలుసుకొన్నప్పుడయినా, ఎవడు ముందు "నమస్కారం" అంటాడో వాడు రొండోవాడి దృష్టిలో తక్కువవాడు. బహుశా వాడి బేసిక్ పే తక్కువ అయి వుంటుంది. వాడి యిల్లు చిన్నది, వాడి పెళ్ళాం అనాకారిది, వాడి పిల్లలు బుద్ధిహీనులూ అవుతారు.

అయినా చెప్పాను. మాధవరావుకి, మా ప్రిన్సిపాల్‌గారి పోరు పడలేక.

"అవును-నా నోటీస్‌లో కొచ్చింది. పార్కుల్లో జూదా లాడుతున్నారని, మందు పార్టీలు జరుగుతున్నాయని, చివరికి వ్యభిచారాలు కూడా చేస్తున్నారని, పైగా చుట్టూరా గుడిసెలు కూడా చూడడానికి అసహ్యంగా వున్నాయి. ఆ గుడిసెల మధ్య పార్కు లుంటాయని చాలామంది వూహించలేరు!" అన్నాడు మాధవరావు.

"చదువుకునే కుర్రాళ్లు, ఎదుగుతున్న యువతీ యువకులు మసలే చోటు నైట్ కాలేజీ కుర్రాళ్లు అలాంటి దృశ్యాలు చూస్తే కలిగే పరిణామం వూహించు!" అన్నాను ఏకవచన ప్రయోగం మర్చిపోకుండాను. లేకపోతే నే నతన్ని మన్నిస్తున్నా ననుకుని అతను క్షమించక పోవచ్చు కదా.

"ఏదో ఒకటి చేద్దాం" అన్నాడు లేస్తూ.

పదిరోజుల్లో పార్కు మూసేశారు. అందులో రేడియో తీసేశారు. లైట్లు తొలగించారు. "అయ్యో! ఇందువల్ల ఆ దుర్మార్గులు మరీ పెచ్చురేగిపోయి గోడలు దూకి ఈ అనాచారాలన్నీ కొనసాగిస్తారేమో" అని భయపడ్డాం నేనూ మా ప్రిన్సిపాల్‌గారున్నూ.

ఇంకో పదిరోజుల తరువాత ఓ రోజు ఉదయం కాలేజీకి వెడుతూ, పార్కు దగ్గిర రకరకాల జనం కర్రా, కంపా, తాటాకూ, వెదుళ్ళూ, మేకులూ, సుత్తులూ, పారలూ, గునపాలూ పట్టుకుని నిల

బద్ధం చూశాను. సాయంకాలానికి పార్కు చుట్టూ వున్న గుడిసెలన్నీ పార్కు లోపలికి బదలాయింపు అయ్యాయి.

"ఇదా నువ్వు చేసిన నిర్వాకం! అందమైన పార్కు కాస్తా అలగా జనానికి నివేశన స్థలాలుగా యిప్పించేశావా?" అని కోప్పడ్డాను మాధవరావును. "నీకు చాతకాకపోతే ఊరుకోవాలి. అంతేకాని ఇదే మన్యాయం! అశోకుడి కాలంనుంచీ మనదేశంలో పట్టణాల మధ్య అందమైన ఉద్యానవనాలు నిర్మించేరు గాని నీకుమల్లే ఉద్యానవనాల్ని దుర్వినియోగపరచడం కనీ వినీ చదివీ యెరగం!" అన్నాను.

"కనీ వినీ చదివీ ఎరక్కపోతే అది నీ తప్పు! నే నిప్పటికి ఆరు పట్నాల్లో పనిచేశాను. ఒక్కచోట కూడా జనానికి పార్కుల్లో కూర్చుని సరదాగా గడపడానికి టైమ్ మిగలడంలేదు. పైగా ఎక్కడ లైఫ్‌బాయి వుంటే అక్కడ ఆరోగ్యం వున్నట్టు, ఎక్కడ పార్కులు గ్రీన్ బెల్టులూ వుంటే అక్కడ స్లమ్స్ అనబడే మురికివాడలు అభివృద్ధి చెందుతున్నాయి. వాళ్ళందర్నీ ఏరి ఊరవతల పారెయ్యమంటారు నీలాంటివాళ్లు. అంతేగా! కాని అలా కుదర్దు. వాళ్ళంతా ఎవరనుకున్నావు? వాళ్ళే నిజమైన ప్రజలు, శ్రామికులు, కార్మికులు, కష్టజీవులు, మీదుమిక్కిలి వోటరు!! వాళ్ళని పొమ్మనడానికి ఏ ప్రభుత్వానికి దమ్ముల్లేవు. పార్కుల చుట్టూరా గుడిసెలు వేసుకుని రోడ్డు వెడల్పు తగ్గిస్తారు. అందువల్ల ఏక్సిడెంట్స్ ఎక్కువై, వాళ్లే, వాళ్ళ పిల్లలే చస్తున్నారు. వికలాంగు లవుతున్నారు. ఈ యాంత్రికమైన సంస్కృతిలో ఉద్యాన వనాలొకటి తక్కువొచ్చాయా మీకు?" అని నామీద అరిచాడు మాధవరావు.

ఏ వూరు ట్రాన్స్‌ఫరైతే ఆ వూళ్ళో చక్కటి బంగళాలు, వాటి చుట్టూ గార్డెను. దేవుడు చాలా మేలుచేసే ఫాంటెన్లు వుంటాయి మాధవరావుకి. అతను యిలా కాకపోతే ఇంకెలా మాట్లాడతాడు? అనుకున్నాను.

(7-7-79)